క్లుప్తంగా

కృతజ్ఞతలు


మంత్రి ఆర్‌కే రోజా

నగరి : జగనన్న విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించడానికి నగరిలో నిర్వహించిన ముఖ్యమంత్రి సభ సూపర్ సక్సెస్ అయిందని మంత్రి ఆర్‌కే రోజా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు లెక్కకు మించి జనం హాజరయ్యారన్నారు. నగరి చరిత్రలో ఇలాంటి భారీ సమావేశం జరగలేదన్నారు. నభూతో నభవిష్యత్ అన్న రీతిన సభను విజయవంతం చేయడానికి పాటు పడిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు అన్నారు.

పొలంబడితో ప్రయోజనం

నింద్ర: రైతులు పొలంబడి కార్యక్రమం వ్యవసాయ అధికారుల సూచనలు పొంది అధిక దిగుబడులు సాధించాలని ఏఓ తులసీరాం అన్నారు. మండలకేంద్రం నింద్రలోని అక్కగారిపేట వెళ్లే దారిలో ఉన్న రైతుల పొలాల్లో మంగళవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు వరి, వేరుశనగ పంటల సాగులో చేపట్టాల్సిన అంశాలపై పలు సూచనలు ఇచ్చారు. అలాగే పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణపై కూడా అవగాహన కల్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పుత్తూరు రూరల్: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణులు, ఏదైనా డిగ్రీ పొందిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు తమ పేర్లను కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో సెప్టెంబర్ 7వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 63009 54441 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై శ్రద్ధ పెట్టండి

పాలసముద్రం : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెడితే ఆరోగ్యం బాగుంటుందని సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రభుత్వం జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపల్ ధనుంజయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేయకముందు సబ్బుతో చేతులు కడుక్కోవాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారి

పుత్తూరు రూరల్: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఇందిర సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మునివేలు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. చెరువుల్లో చేపల వేలంపాట ద్వారా, అక్రమంగా వెలుస్తున్న లేఅవుట్లను క్రమబద్ధీకరిస్తూ పంచాయతీలకు నిధులను సమకూర్చుకోవాలని సూచించారు. తహసీల్దార్ పరమేశ్వరస్వామి, వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, విమల ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు
- రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల సమీక్ష సమావేశం
- హాజరైన డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు


సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కలెక్టరేట్: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాలకు సంబంధించి ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీచరణ్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే పథకంతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. స్పందన, జగనన్నకు చెబుదాంలో నమోదవుతున్న రెవెన్యూ సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ హ్యాబిటేషన్‌లలో శ్మశాన వాటికల ఏర్పాటుపై వేగవంతంగా చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న లేఅవుట్‌లలో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి..

ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోందన్నారు. నియోజకవర్గాల వారీగా అభివృద్ధికి ప్రభుత్వం వేలాది కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి, ప్రతి సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం..

ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్యం రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వేలాది కోట్లను ఈ రంగాలు అభివృద్ధి చేసేందుకు ఖర్చు చేస్తోందని చెప్పారు. జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లాడుతూ కోదలమడుగు, టేకుమంద, మొగిలి, కీరమంద, పాలేరు గ్రామాల్లో సోలార్ ఫెన్సింగ్ నిర్మించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్ అండ్‌బీ రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.

బాధ్యతగా సమస్యలు పరిష్కారం..

కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను అలసత్వం లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను బాధ్యతతో పరిష్కరించాలని చెప్పారు. అనంతరం గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల అభివృద్ధిని ఆయన మంత్రులకు వివరించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు విజయ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభావతి, ఉమాదేవి, విజయేంద్రరావు, వెంకటరమణారెడ్డి, లక్ష్మీ, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో ప్రగతి ఇలా..

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో రూ.31.8 కోట్లతో 88 గ్రామ సచివాలయాలు మంజూరు కాగా రూ.22.71 కోట్లతో 47 భవన నిర్మాణాలు, రూ. 18.52 కోట్లతో 85 రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా రూ.12.25 కోట్లతో 49 పూర్తి చేసినట్లు కలెక్టర్ వివరించారు. రూ.9.82 కోట్లతో 56 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు కాగా రూ.5.95 కోట్లతో 12 భవన నిర్మాణాలు పూర్తి కాగా, మిగిలినవి పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.118.32 కోట్లతో 2,528 పనులు మంజూరు కాగా రూ.34.47 కోట్లతో 718 పనులు పూర్తి అయినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 202 పనులకు రూ.7.60 కోట్ల అంచనాలతో నిధులు విడుదల అయినట్లు చెప్పారు. ఇందులో రూ.2.13 కోట్లతో 82 పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. రహదారులు, రోడ్ల నిర్మాణంలో భాగంగా జీడీ నెల్లూరు నియోజకవర్గంలో 108.200 కి.మీల పొడవు గల స్టేట్ హైవే, 238.097 కి.మీ. పొడవు గల మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు, 48 కి.మీ పొడవు గల ఇతర రోడ్లు మొత్తం 394.297 కి.మీ రోడ్ల నిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. 2019–24 సంవత్సర కాలంలో జీడీ నెల్లూరు నియోజకవర్గ పరిధిలో దాదాపు రూ.1789.50 కోట్లతో 87.79 కి.మీల బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. రూ.187 కోట్లతో 10,407 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా రూ.128.94 కోట్లతో 6,452 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో ఇంటింటికీ తాగునీరు సరఫరాలో 5,525 ఇళ్లకు తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేశామన్నారు. 5408 గృహాలకు నూతన విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చినట్లు చెప్పారు.


సమీక్షకు హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు

గాలి భానుకు మతి భ్రమించింది


వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

- సీఎం జగనన్న రూ.21.37 కోట్లు షుగర్ ఫ్యాక్టరీ వర్కర్లకు బకాయిలు చెల్లించారు
- భానుప్రకాష్‌కు విద్యాదీవెన అందించి జ్ఞానబోధ కలిగించాలి
- సీఎం సభ సక్సెస్‌పై వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు

నగరి : నగరి పట్టణంలో జరిగిన జగనన్న సభతో షాక్ తగిలి టీడీపీ నాయకుడు భాను ప్రకాష్‌కు మతి భ్రమించింది అని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దేవా చేశారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకున్న వారు మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలదండలు వేసిన అనంతరం సభ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ నగరి చరిత్రలో ఇప్పటివరకు జరగని రీతిలో బహిరంగ సభ విజయవంతం కావడంతో టీడీపీ నాయకుడు భానుప్రకాష్‌కు మతిభ్రమించిందని అన్నారు. సభ నిర్వహణకు పక్కనే ఉండి లెక్కలేసిన ఆడిటర్‌లా పది కోట్లు అయిందని వాగుతున్నాడని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదని భాను అనడం చూస్తుంటే జగనన్న సభ ఇచ్చిన షాక్‌తో ఆయన నాలుగేళ్లు వెనక్కి వెళ్లి చంద్రబాబు పాలనలోనే ఉన్నట్లు తెలుస్తోందన్నారు. సభకు వస్తూనే రూ.21.37 కోట్లు షుగర్ ఫ్యాక్టరీ వర్కర్లకు బకాయిలు చెల్లించి వచ్చారని, మధ్యాహ్నం అర్జీలు ఇచ్చిన బాధితులకు సాయంత్రానికి సాయం అందించారని తెలిపారు. రికార్డు పూర్వకంగా ఒక్క రోజులోనే ఇన్ని పనులు జరిగితే ఏమీ జరగలేదనడం గాలి భానుకు విజ్ఞానం ఏమేరకు ఉందో బోధపడుతోందన్నారు. రూ.5.4 కోట్ల వ్యయంతో ఆస్పత్రిని అభివృద్ధి చేసి ప్రారంభిస్తే, ఆ ఆస్పత్రిని ఎప్పుడో ప్రారంభించారు కదా అనడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. పవర్‌లూమ్ వర్కర్స్‌కు ఎలక్ట్రిసిటీ డ్యూటీ యూనిట్‌కు ఒక్క రూపాయి తగ్గించినట్లు ప్రకటించారని, నేడు ప్రతి మరమగ్గ కార్మికుడు సంబరాలు చేసుకుంటున్నా, పచ్చకామెర్లు వచ్చిన ఆయనకు కనిపించదన్నారు. గాలేరు–నగరి ప్రాజెక్టును వైఎస్సార్ ప్రారంభించారని గత చంద్రబాబు పాలనలో ఆ ప్రాజెక్టు ఇంచు కూడా కదల్లేదన్నారు. కాగా నేడు ఆ ప్రాజెక్టు గురించి టీడీపీ నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. భానుప్రకాష్‌కు కూడా విద్యాదీవెన అందించి జ్ఞానబోధ కలిగించడంతో పాటు జగనన్న సభతో షాక్‌కు గురైన ఆయనకు ఆరోగ్యశ్రీలో ట్రీట్‌మెంట్ ఇప్పించాలని మంత్రి ఆర్‌కే రోజాను కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాలన్, పార్టీ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్, బాబు, భూపాలన్, ఇళంగో, గోపాల్‌రెడ్డి, మురుగ, ఎల్లప్పరెడ్డి, హమీద్, గోవిందరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లు


ఇనాంకొత్తూరు స్కూల్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్

వెదురుకుప్పం: కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ప్రభుత్వ స్కూళ్లు రూపుదిద్దుకుంటున్నాయని ఎంపీపీ నాగరాణి అన్నారు. మంగళవారం మండలంలోని కోమరగుంట, ఇనాంకొత్తూరు ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కారు స్కూళ్లను అన్నివిధాలా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని చెప్పారు. కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో స్కూళ్లు దుస్థితికి చేరుకున్నా పట్టించుకోలేదని, కనీసం సరైన సౌకర్యాలు కల్పించలేకపోయిందని ఆరోపించారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా మార్చేశారని తెలిపారు. నాడు–నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. అనంతరం ఆమె కొమరగుంట ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద కింద అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి వసతలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంపీటీసీలు మునిచంద్రారెడ్డి, హరి, ఈఓపీఆర్డీ పురుషోత్తం, సర్పంచ్‌లు మాధవి, ద్రాక్షాయణి, డీడీఓ కుమార్, ఉపాధ్యాయుడు వాసుదేవరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, మాజీ సర్పంచ్ గోవిందన్, వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న దాత

నగరి : నగరి మున్సిపాలిటీలోని ఏకాంబరం కుప్పంకు చెందిన ప్రభాకరన్ సతీమణి స్వాతి మంగళవారం మానసిక, వికలాంగత్వంతో బాధపడుతున్న పిల్లలకు అన్నదానం చేశారు. మంగళవారం పట్టణ పరిధిలోని శిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలకు వెళ్లిన ఆమె 50 మంది పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసి వారి మధ్య తమ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల చెంతకే పథకాలు

- దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రభుత్వం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రభుత్వం నగదు జమ చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మంగళవారం మండలంలో ఆళత్తూరు సచివాలయం పరిధిలోని కొత్తూరు, ఆళత్తూరు, టీటీ కండ్రిగ, శీకాయపట్టెడ, లక్ష్మీపురం, సేకువారిపల్లి, ఈడిగపల్లి గ్రామాల్లో డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి, ఎంపీపీ లత, సర్పంచ్ పుష్పాంజలి ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పట్ల సంతృప్తిగా ఉన్నారని, అందుకే ప్రజలు సీఎం జగనన్న ఎక్కడికి వెళ్లిన బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా అందుతున్న సంక్షేమ పథకాలు ప్రజలను ఆకర్షితులను చేస్తున్నాయని గుర్తు చేశారు.

సమస్యలు.. పరిష్కార మార్గాలు..

అనంతరం ఆళత్తూరు గ్రామానికి చెందిన శిల్ప అనే మహిళ మాట్లాడుతూ వర్షం వస్తే రోడ్డు బురదమయం మవుతోందని మంత్రి నారాయణస్వామి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంటనే సీసీ రో డ్డు నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆ దేశించారు. అదేవిధంగా టీటీ కండ్రిగకు చెందిన రైతు చిన్నబ్బ తనకు రైతు భరోసా అందలేదని చెప్పడంతో మంత్రి స్పందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భ రోసా పథకం అందేలా చూడాలని ఏఓ హేమలతను ఆదేశించారు. అలాగే శీకాయపట్టెడ, ఈడిగపల్లి గ్రా మాల్లో విద్యుత్ లైన్లు, స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరగా, మంత్రి తక్షణం ఆ సమస్యలను పరిష్కరించా లని విద్యుత్ ఏడీఈ నాగరాజును ఆదేశించారు. అ లాగే టీటీడీ పరిధిలో ఉన్న ఆళత్తూరులో పునర్‌నిర్మాణంలో ఉన్న పురాతన వరద వేంకటేశ్వర ఆలయం, టీ టీ కండ్రిగ గ్రామానికి మంజూరైన ఆలయ నిర్మాణ ప నులను ఆయన సందర్శించారు. అదేవిధంగా టీటీ కండ్రిగ గ్రామస్తులు మాట్లాడుతూ తాము పూజించే పురాతన గంగమ్మ ఆలయానికి దారి లేదని, ఓ రైతు అడ్డుకుంటున్నారని గ్రామస్తులు మంత్రి దృష్టికి తెచ్చా రు. వెంటనే ఆయన స్పందిస్తూ ఆ భూములను సర్వే చేసి డీకేటీని గ్రామస్తులకు అప్పగించాలని తహసీల్దార్ రవికుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్ర ధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, జిల్లా కోశాధికారి ధనుంజయరెడ్డి, వైస్ ఎంపీ పీ కార్తీక్‌రెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, జిల్లా కార్యదర్శి గోపీ, మాజీ సర్పంచ్ ధర్మయ్య, నాయకులు కృష్ణారె డ్డి, సర్వేశ్వర్, ధనుంజయవర్మ, జయకుమార్, శ్రీనివా సులునాయుడు, చిట్టి, ఏకాంబరం, లోకనాథరెడ్డి, రా ము, చందురాజు, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

నాగరికతకు ప్రతీక తెలుగుభాష

- ఘనంగా తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు


పన్నూరు పాఠశాలలో జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

నగరి : నియోజకవర్గవ్యాప్తంగా తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవ సంబరాలు అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరి పరిధిలోని ముడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తుల్లో విచ్చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. క్రీడా దినోత్సాన్ని పురస్కరించుకుని విద్యార్థులు పురవీధుల్లో హాకీ బ్యాట్‌లు, బంతులతో ర్యాలీ నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నగరి మండలంలోని నంబాకం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల వేషధారణలతో పాటు తెలుగుభాషా దినోత్సవం అంటూ పువ్వులతో నేలపై రాసిన అక్షరాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని ఎం.కొత్తూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష ప్రాచుర్యానికి విశేష కృషి చేసిన 128 మంది భాషా పండితుల చిత్రపటాలతో విద్యార్థులు చేతపట్టుకుని ప్రదర్శన చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. అలాగే స్థానిక డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవం సంబరాలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ బి.సుబ్రమణ్యం గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ సి.చినపాపమ్మ మాట్లాడుతూ తెలుగుభాష కేవలం ఒక వార్తా ప్రసార సాధనం మాత్రమే కాదని, ఇది తెలుగు ప్రజల చరిత్ర, సంస్కృతి, నాగరికతను ప్రతిరూపమన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక మెయిన్ స్కూల్ హెచ్‌ఎం సుబ్రమణ్యం ఆచారి అన్నారు. మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులచే తెలుగు తల్లి, కవులు, చరిత్రకారుల వేషధారణలతో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. గోపాలకృష్ణాపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉపాధ్యాయుడు గోపి తెలుగు సాహితీమూర్తుల చిత్రపటాలను అందజేశారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వడమాలపేటలో: మండలవ్యాప్తంగా పాఠశాలల్లో తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్వీపురం హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన అష్టావధానం, భువన విజయం నాటకాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓలు పద్మావతి, తులసీరామ్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం (నగరి) : మండలంలో పన్నూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవ, జాతీయ క్రీడా దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు/పాలసముద్రం/పెనుమూరు/శ్రీరంగరాజపురం/కార్వేటినగరం/వెదురుకుప్పం: నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలువురు మాట్లాడుతూ అమ్మభాష అయిన తెలుగుభాషను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో తెలుగు భాషా పండితులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శ్రీరంగరాజపురంలో..


పుత్తూరు: వేషధారణలతో విద్యార్థుల ప్రదర్శన


వెదురుకుప్పం: పచ్చికాపల్లంలో


హాకీ ఆడుతూ క్రీడా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


నంబాకం పాఠశాలలో విద్యార్థుల వేషధారణ


గంగాధరనెల్లూరులో..


పాలసముద్రం: జానపద గేయాలతో అలరిస్తున్న విద్యార్థులు


కార్వేటినగరం: డీఎం పురం పాఠశాలలో

ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి


సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి

పుత్తూరు రూరల్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సచివాలయ సిబ్బంది వివరాలు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం లక్ష్మీనగర్, ఎన్జీఓ కాలనీ సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ నమోదులో పుత్తూరు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచేలా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా చివరి శుక్ర, శనివారాల్లో సిటిజన్ ఔట్‌రీచ్ క్యాంపెయిన్ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని వలంటీర్లను సమన్వయం చేసుకుని విజయవంతం చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు ముమ్మరం చేయాలన్నారు. సచివాలయాలకు వచ్చే అర్జీదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. వారి సమస్య పరిష్కారం అయ్యే వరకు వారికి సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వీఎల్‌ఎన్‌మూర్తి పాల్గొన్నారు.

పురవీధుల్లో వేణుగోపాలస్వామి విహారం


పురవీధుల్లో ఊరేగుతున్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారు

కార్వేటినగరం: మండలకేంద్రంలోని వేణుగోపాల ఆలయంలో తెపోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా రెండవ రోజు మంగళవారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన వంటి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌ను పట్టువస్త్ర, సుగంధర భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు వేద మంత్రాలు పఠిస్తూ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం స్వామివారు పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటా స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధ్యక్షుడు సురేష్‌కుమార్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.